క్లుప్తంగా

వైభవంగా భవానీ మాలధారుల గ్రామోత్సవం



సిద్ధాంతంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భవానీ మాలధారులు

పెనుగొండ: భవానీ మాలధారులు సిద్ధాంతంలో శనివారం గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మూడేళ్ల శ్రీను గురు భవానీ ఆధ్వర్యంలో సుమారు 70 మంది భవానీలు గ్రామంలో అమ్మవారి వేషధారణతో జై దుర్గ, జై జై దుర్గ, జై భవాని, జై జై భవాని అంటూ గ్రామమంతా నినదిస్తూ ఊరేగారు. భవానీల పీఠంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

నేడు మాలల చలో గుంటూరు



విలేకరులతో మాట్లాడుతున్న గుమ్మాపు సూర్యవరప్రసాద్

పాలకొల్లు అర్బన్: ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా ఆదివారం అఖిల భారత మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గుంటూరు సమీపంలోని నల్లపాడులో మాలల మహా గర్జన ఏర్పాటు చేసినట్లు పీవీ రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్ చెప్పారు. రాష్ట్రంలో ఉన్న మాల ప్రజాప్రతినిధులు, మాల ఉద్యోగులు, మాల విద్యార్థులు, మాల మహిళలు ఈ సదస్సుకి పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. బీఆర్ అంబేద్కర్ ఆలోచనా విధానాలను ముందుకు తీసుకువెళ్లడానికి అంబేడ్కర్ వారసులుగా రాబోయేతరం మాల జాతి బిడ్డలకు జరగబోయే నష్టాన్ని ఆపేందుకు ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. విలేకరుల సమావేశంలో మానుకొండ శ్రీనుబాబు, సుంకర సీతారామ్, మీసాల జయరాజు, కొప్రపాటి వీరాస్వామి, మద్దా చంద్రకళ, కోట రత్నరాజు, పీతాని పుష్పరాజ్, ఇంజేటి కుమార్‌స్వామి, బుంగా జయరాజు, పొన్నమండ బాలకృష్ణ, చేరుగొండి పద్మకిషోర్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి సింపోజియంలో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: డాక్టర్ బీవీ రాజు డిగ్రీ కళాశాల, భీమవరంలో ఈ నెల 13, 14తేదీల్లో నిర్వహించిన జాతీయస్థాయి సింపోజియం పోటీల్లో చాంబర్స్ కళాశాల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో బహుమతులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహరావు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు సీహెచ్ బిందు భార్గవి, డి రేనాగోల్డ్, ఎన్ దేవిశ్రీ, ఎం అంజలి, బి లావణ్య, పి బేబీశ్రీ, పి సాయిపూర్ణిక, ఎ శివమహాలక్ష్మి, కె బిందుల సృజనాత్మకతను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ అడ్వైజర్స్ డా. ఏబీఎస్ మూర్తి, ఎన్.సీతారామారావు, కేవీ సీతారామ్, డి.సిరిచందన, అంజలి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంధన పొదుపు వారోత్సవాలు

పాలకొల్లు సెంట్రల్: భావితరాల అవసరాలు దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఇంధన వనరులను వృథా చేయరాదని విద్యుత్ పొదుపు తప్పనిసరిగా పాటించాలని ఎలక్ట్రికల్ ఏడీఈ సీహెచ్ రామకృష్ణ అన్నారు. శనివారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు పురస్కరించుకుని కళాజాత బృందం ద్వారా విద్యుత్ పొదుపుపై వారపు సంత మార్కెట్ వద్ద అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఈ రామకృష్ణ మాట్లాడుతూ విద్యుత్ పొదుపు వారోత్సవాలు డిసెంబర్ 14 నుంచి 20 వరకూ జరగనున్నాయన్నారు. వినియోగదారుల్లో విద్యుత్ పొదుపుపై అవగాహన కలిగిస్తూ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు, సదస్సులు నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో డీఈ ఇ.వెంకట్రావు, ఏఈ ఎస్‌కే బాబ్జీ, ఎల్ శ్రీనివాసరావు, ఆర్‌వీ అప్పారావు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై దాడి

పెనుగొండ: తణుకు ఎక్సైజ్, భీమవరం ఈఎస్ టాస్క్‌ఫోర్స్‌లు శనివారం నిర్వహించిన దాడుల్లో సిద్ధాంతంలో రెండు బెల్ట్ షాపుల నిర్వాహకులను అరెస్ట్ చేసినట్లు సీఐ ఎస్ మణికంఠ రెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో ఆర్.సామ్యేలు, జి.శ్రీనివాస్‌ల వద్ద నుంచి 18 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సైలు ఆర్.మధుబాబు, ఎల్.రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నిత్యావసరాల దుకాణం.. నిత్యం మూతే

మూణ్ణాళ్ల ముచ్చటగా మిగిలిన వైనం



మూసేసి ఉన్న నిత్యావసర సరుకుల షాపు

పాలకొల్లు సెంట్రల్: మార్కెట్లో మండిపోతున్న నిత్యావసర వస్తువుల ధరల దెబ్బకు సామాన్య మానవుడు బయటకు వచ్చి ఏ వస్తువు కొనాలన్నా విలవిల్లాడిపోతున్నారు. మార్కెట్ ధరలతో ప్రజల కష్టాలను పరిశీలించిన కూటమి ప్రభుత్వం వెంటనే నిత్యావసర సరుకులు పేద ప్రజలకు అందుబాటులో ఉండేలా మార్కెట్ పై తక్కువ ధరకు విక్రయించేలా పట్టణంలో హడావుడిగా ఓ దుకాణం తెరిచారు. ఈ నిత్యావసరాల విక్రయ దుకాణం తెరిచి సరిగ్గా రెండు నెలలు పూర్తయ్యింది. అయితే ఈ దుకాణం పేద ప్రజలకు ఒరిగిందేమి లేదు. ఈ దుకాణం తెరిచిన ఓ పది రోజులు మాత్రమే ఉల్లిపాయలు, వంటనూనెలు విక్రయించారు. అప్పటి నుంచి ప్రజలు రోజూ ఈ దుకాణం వద్దకు ప్రజలు వెళ్లి నిరాశగా తిరిగివస్తున్నారు.

బోర్డులే తప్ప సరుకులు నిల్

ఈ నిత్యావసర దుకాణంలో టమాటాలు, ఉల్లిపాయలు, వంట నూనెలు అమ్మేలా అక్టోబర్‌లో ఆర్భాటంగా తెరిచారు. నాడు షాపు తెరిచిన సమయంలో ఉల్లిపాయలు మార్కెట్లో రూ.70 నుంచి రూ.80 లు ఉండగా ఇక్కడ రూ. 32, రూ. 47 లకు విక్రయించేవారు. అలాగే ఆయిల్ ధరలు మార్కెట్లో పామాయిల్ (850గ్రా ప్యాకెట్) రూ. 120, సన్‌ఫ్లవర్ (910గ్రా. ప్యాకెట్) రూ. 140లు ఉండగా ఇక్కడ రూ. 110, రూ. 120లకు విక్రయించే విధంగా బోర్డులను ఏర్పాటుచేశారు. టమాటాలు అయితే రెండు రోజులు కూడా విక్రయించలేదని స్థానిక ప్రజలు చెబుతున్నారు. పోనీ ఈ దుకాణాలు నియోజకవర్గంలో అన్ని మండలాల్లో ఏర్పాటు చేశారా? అంటే అదేమీలేదు. నియోజకవర్గ స్థాయిలో ఒక్కచోటే ఏర్పాటు చేశారు. అంటే పట్టణ ప్రజలకు మాత్రమే అందుబాటులో ఉండేలా ఈ షాపులు ఏర్పాటు చేశారు. ఏ సమయంలో వెళ్లినా షాపు మూసే ఉంటుంది.

మార్కెట్ యార్డుకు వెళ్లాల్సిందేనా?

ఏదైనా సమయంలో షాపు తెరిచారో ఇక్కడ సరుకు లేదు మార్కెట్ యార్డ్‌కు వెళ్లండని సలహా ఇస్తున్నారు తప్ప ఇక్కడ ఏ వస్తువు విక్రయించడంలేదు. ఎంతో మంది పేద ప్రజలు ఈ షాపు మీద ఆధారపడి ఉండడం గమనార్హం. ప్రభుత్వం తప్పుని తప్పని చెప్పినా ఇక్కడ ప్రజాప్రతినిధులకు ఒప్పుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఎందుకంటే షాపు మూసివేసే సమయంలో వెళ్లి ఫొటోలు తీశారని కూడా ప్రజాప్రతినిధులు ఎదురుదాడి చేస్తున్నారని పట్టణ ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా స్పందించి నిత్యావసరాల దుకాణాన్ని నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

నిత్యావసరాల ధరలు పెరిగాయి



నిత్యావసరాలు విక్రయించే షాపు ప్రారంభించిన రెండు రోజులు మాత్రమే టమాటాలు విక్రయించారు. మళ్లీ టమాటాలు అమ్మలేదు. రెండు నెలలుగా రోజూ షాపు వద్దకు వెళ్లి తిరిగి వస్తున్నాము. మాలాంటి వారి కోసం ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుందని ఆనందించాం. పది రోజుల్లోనే మా ఆశలన్నీ ఆడియాశలయ్యాయి. మార్కెట్లో పెరిగిన ధరలతో నిత్యావసర సరుకులు కొనలేకపోతున్నాము.

– ఎస్.కె లక్ష్మీ, పాలకొల్లు

ఎప్పుడూ మూసే ఉంటుంది



మార్కెట్లో నిత్యావసర సరుకులు ధరలు పెరిగిపోయాయి. తక్కువ ధరకే సరుకులు వస్తాయని ఎంతో ఆనందించి ఆధార్ కార్డు తీసుకుని ప్రభుత్వం ఏర్పాటుచేసిన దుకాణం వద్దకు వెళ్లాం. ఉల్లిపాయలు, వంటనూనెలు తక్కువ ధరకే విక్రయించారు. మళ్లీ ఓ మూడు రోజులకు వెళ్లాం షాపు తీయలేదు. సరే అని మరోసారి వెళ్లగా మూసివేసి ఉంది. మా ఆశలన్ని మూడునాళ్ల ముచ్చటేనా అనిపించింది.

– గోవిందమ్మ, పాలకొల్లు

స్టాక్ ఉన్నప్పుడే అమ్మకాలు

ప్రస్తుతానికి స్టాక్ రావలసి ఉంది. పది రోజులు క్రితం 470 కేజీలు ఉల్లిపాయలు, 200 కేజీలు పామాయిల్ ప్యాకెట్లు విక్రయించాం. రాబోయేది పండుగ సీజన్ కాబట్టి మినపప్పు, మినపగుళ్ల ఈ కేంద్రాల ద్వారా విక్రయించాలని ఉన్నతాధికారులకు మార్కెట్ ధరలు పంపించాం. త్వరలో ఇవి కూడా అందుబాటులో ఉంచుతాము. ఉల్లిపాయలు, స్టాక్ ఉంటే షాపు ఉదయం 10 గంటలకు ఓపెన్ చేసి సాయంత్రం 6 గంటల వరకూ అందుబాటులో ఉంటుంది.

– జి.నరేష్‌కుమార్, సీఎస్ డీటీ, పాలకొల్లు

'రైతులను మోసం చేసిన సీఎం చంద్రబాబు'



కుంచిలపల్లి వినిస్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్: తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఇంటికి పంపిస్తానని హామీ ఇచ్చి 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 2024 ఎన్నికల ముందు కూడా రైతులకు రూ.20వేలు పెట్టుబడి సాయం అందిస్తానని మోసం చేశారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి వచ్చి 6 నెలలు గడచినా ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయలేదని మండిపడ్డారు. చేతగాని హామీలిచ్చి ఏ వర్గాన్ని వదలకుండా అందరినీ మోసం చేస్తున్నారని, ఉత్తుత్తి కబుర్లతో జనాన్ని మోసం చేస్తూ కాలం గడుపుతున్నారని దుయ్యబట్టారు. రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమయ్యిందన్నారు. ఆర్బీకేలను ఏర్పాటు చేసి రైతులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్ అండగా నిలిచారని గుర్తు చేశారు. రైతులకు సున్నా వడ్డీ, సకాలంలో విత్తనాలు, ఎరువులు అందడం లేదన్నారు. 53.58 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందించాలంటే రూ.10,718కోట్లు అవసరమని, అయితే బడ్జెట్‌లో కేవలం రూ.1000కోట్లు కేటాయించారని పేర్కొన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలి



ఎం.అంజయ్య

నరసాపురం: పట్టణ వాసులు తడి, పొడి చెత్తను మున్సిపల్ సిబ్బందికి వేర్వేరుగా అందించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చెత్త సేకరణ విషయంలో కఠిన నిర్ణయాలు అమలు చేస్తామని చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు. రోడ్లపై చెత్త వేయవద్దని కోరారు. అలాగే పట్టణంలో పలు ప్రాంతాల్లో పశువులు తిరుగుతున్నాయన్నారు. యజమానులు విచ్చ విడిగా రోడ్ల పైకి వదిలేస్తున్నారని అన్నారు. 3 రోజుల్లో పశువులను వాటి యజమానులు కట్టడి చేసుకోవాలని చెప్పారు. లేదంటే పశువులను గోశాలలకు తరలించి, యజమానులపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

వశిష్ట గోదావరికి పంచ హారతులు

పెనుగొండ: సిద్ధాంతం వశిష్ట గోదావరి వద్ద శనివారం రాత్రి పౌర్ణమి పురస్కరించుకొని హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కాటం శ్రీను–లలిత దంపతులు గోదావరి మాతకు పంచ హారతులు వైభవంగా ఇచ్చారు. వేదమూర్తులు కలగబద్రుడు స్వామి బ్రాహ్మణత్వంతో ఏకముక, ద్విముఖ, చతుర్ధ, పంచమ, కుంభ, నక్షత్ర, పూర్ణ, కుంభ, సర్ప, హారతులు వశిష్ట గోదావరికి హారతుల కనులపండువగా నిర్వహించారు. నదులను ఆరాధించడం అనాదిగా వస్తున్న మన సంప్రదాయమన్నారు. కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులతో పాటు అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ విజయవంతం



పాలకొల్లులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న ప్రిన్సిపల్ సివిల్ జడ్జి షేక్ జియావుద్దీన్

నరసాపురం: నరసాపురం కోర్టు సముదాయంలో శనివారం నిర్వహించిన జాతీయలోక్ అదాలత్ పూర్తిస్థాయిలో విజయవంతమైంది. రికార్డు స్థాయిలో 437 కేసులు రాజీ చేశారు. న్యాయవాదులు, పోలీసుశాఖ, మీడియా విస్తృత ప్రచారం, కక్షిదారుల్లో పెరిగిన అవగాహన కారణంగా ఈ స్థాయిలో కేసులు పరిష్కరించినట్టు నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ పి.విజయదుర్గ చెప్పారు. మొత్తం 3 బెంచ్‌లు ఏర్పాటు చేసి కేసులు పరిష్కరించారు. బెంచ్ అధికారులుగా విజయదుర్గతో పాటు, సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్ వ్యవహరించారు. సభ్యులుగా బి.ప్రగతి, కె.స్వర్ణ, జి.సత్యనారాయణ వ్యహరించారు. కేసులు రాజీ ద్వారా కక్షిదారులు రూ.1 కోటి 80లక్షల 30వేలు లబ్ధి పొందినట్టు జడ్జి విజయదుర్గ చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీ మార్గమే రాజ మార్గమన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని చెప్పారు. నరసాపురం డీఎస్పీ డాక్టర్ డి.శ్రీవేద, బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు కోర్టులో శనివారం లోక్ అదాలత్‌ను ప్రిన్సిపల్ సివిల్ జడ్జి షేక్ జియావుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో 213 కేసులు పరిష్కరించారు. అలాగే రూ.60.09లక్షల పరిహారాన్ని కక్షిదారులకు అందజేశారు. ఐపీసీ కేసులు 90, ఎక్సైజ్ కేసులు 32, ప్రామిసరీ నోటు కేసులు 33, ఎగ్జిక్యూటీవ్ పిటిషన్ కేసులు 3, ఫైనల్ డిక్రీ కేసు 1, మనోవర్తి కేసులు3, చెక్ బౌన్స్ కేసులు 3, పర్మినెంట్ ఇంజక్షన్ కేసు 1, బెంచ్ కోర్టు కేసులు 47 ఉన్నాయి. లోక్ అదాలత్‌లో అడ్వకేట్ మెంబర్ జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు కోట చంటియ్య, ప్యానెల్ న్యాయవాది పి.పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా బాధితులకు పరీక్షలు



రాత్రి సమయంలో రోగులను పరీక్షించేందుకు పర్యటిస్తున్న వైద్య సిబ్బంది

మొగల్తూరు: జాతీయ ఫైలేరియా వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది రాత్రి సమయాల్లో రోగులను పరీక్షించేందుకు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం రాత్రి స్థానిక అబ్రహంపేట, గోడావారిపేట,వేగివారిపేట, భవానీ కాలనీలో పర్యటించి ఆయా గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించారు. బోదవ్యాధికారక క్రిములు రాత్రి వేళలో మనుషులకు దగ్గరగా వస్తాయని, దీంతో రక్త నమూనాలు సేకరించి వ్యాధి నిర్ధారంచేందుకు రాత్రి సమయంలో పర్యటిస్తున్నామని డాక్టర్ దినేష్ తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. పాలకొల్లుకు చెందిన ఫైలేరియా యూనిట్ సిబ్బంది బాలచంద్రుడు, ఎంపీహెచ్ఎస్ పెద్దిరాజు, మొగల్తూరు ఆసుపత్రి సిబ్బంది విరాజిత, కె.సాంబశివరావు, ఎంవీ శాంతకుమారి పాల్గొన్నారు.

నామినేషన్లపై తప్పుడు సమాచారం



దిగమర్రులో విలేకరులతో మాట్లాడుతున్న రైతులు

పాలకొల్లు దిగమర్రు నీటి సంఘం నెం.3, నెం.6, నెం.9 కి నామినేషన్లు వేయడానికి వెళ్లిన తమకు వీఆర్వో గుబ్బల శ్రీనివాసరావు అసత్య సమాచారం ఇచ్చి సమయం ముగిసే వరకు కాలయాపన చేశారని పలువురు రైతులు విలేకరుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తపేట మాజీ సర్పంచ్ దాసరి లాజరు, కవురు సత్యనారాయణ (గాంధీ), ధనకొండ మాధవరావు, గుబ్బల భగవాన్ విలేకరులతో మాట్లాడారు. మాజీ సర్పంచ్ దాసరి లాజరు మాట్లాడుతూ 3 టీసీకి తాను, 6వ టీసీకి ధనకొండ మాధవరావు, 9వ టీసీకి గుబ్బల భగవాన్ నామినేషన్ వేయడానికి వెళ్లామన్నారు. అయితే ఓటరు జాబితాలో ఏ టీసీలో తమ పేర్లు ఉన్నాయో చెప్పలేదని, అలాగే పన్ను రశీదు రాస్తానని, అడంగల్ కాపీ కావాలని, ఇలా సమయం ముగిసే వరకు తాత్సారం చేశారన్నారు. దీంతో సరైన డాక్యుమెంట్లు పెట్టలేని కారణంగా తాము దాఖలు చేసిన నామినేషన్లు చెల్లవని అధికారులు తిరస్కరించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సంఘం ఎన్నికలను అధికారులు సక్రమంగా జరిపించలేదన్నారు. అలాగే ఓటరు జాబితాను వీఆర్వోను రెండు రోజుల క్రితమే అడిగినా ఇవ్వలేదని ఆరోపించారు. ఎంపీటీసీ సభ్యుడు పెదపాటి వెంకటరత్నం, పార్టీ నాయకులు కాటిక సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా నీటి సంఘాల ఎన్నికలు



పెనుగొండలో ఏకగ్రీవంగా ఎన్నికైన నీటి సంఘం సభ్యులు



యలమంచిలి: నీటి సంఘ పాలకవర్గాన్ని అభినందిస్తున్న తహసీల్దార్

పెనుగొండ: పెనుగొండ, ఆచంట మండలాల్లో నీటి సంఘాలు ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. పెనుగొండకు గాను చెరుకువాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎన్నికల్లో పెనుగొండ సాగునీటి సంఘ అధ్యక్షుడిగా జవ్వాది పేర్రాజు, ఉపాధ్యక్షుడుగా గిరి నాగరాజు, 12 మంది టీసీలు ఎన్నిక కాగా, వడలిలో వడలి నీటి సంఘ అధ్యక్షుడిగా జక్కంశెట్టి సత్యనారాయణ ఉపాధ్యక్షుడుగా సంకురాత్రి వీర వెంకట సత్యనారాయణ, టీసీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిద్ధాంతం నీటి సంఘ అధ్యక్షుడిగా బొబ్బిలి శ్రీను టీసీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఆచంట 1 కాలువ నీటి సంఘ అధ్యక్షుడిగా తమ్మినీడి రామకృష్ణ వర ప్రసాద్ ఉపాధ్యక్షుడిగా గుబ్బల సాయిబాబు, ఆచంట 2 కాలువకు అధ్యక్షుడుగా గుబ్బల కాశీ విశ్వనాథం, ఉపాధ్యక్షుడిగా తమ్మినీడి లీలా మాధవ నాగేశ్వరరావు, కొడమంచిలి కాలువకు అధ్యక్షుడిగా నెక్కంటి రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా గాజుల పాటి వెంకటరత్నం, కరుగోరుమిల్లి కాలువ నీటి సంఘ అధ్యక్షుడిగా కడలి నాగ మునీంద్రరావు, ఉపాధ్యక్షుడిగా బండి వెంకటేశ్వరరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో తహసీల్దార్లు జి.అనితకుమారి, జి.కనకరాజు, సర్పంచ్‌లు నక్కా శ్యామలాసోనీ, చింతపల్లి గనిరాజు(చంటి), ఏఈ గుబ్బల జయశంకర్, వెలిచేటి బాబూరాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: మండలంలోని నాలుగు నీటి సంఘాలు ఏకగ్రీవమైనట్లు తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ తెలిపారు. మేడపాడు నీటి సంఘ అధ్యక్షుడిగా పెన్మత్స రామభద్రరాజు, గుంపర్రు నీటి సంఘ అధ్యక్షుడిగా జద్దు రాజేష్, యలమంచిలి నీటి సంఘ అధ్యక్షుడిగా ఆరుమిల్లి రామ శ్రీనివాస్ (చిన్ని), ఏనుగువానిలంక నీటి సంఘ అధ్యక్షుడిగా మేడిచర్ల ధన వెంకట సత్యనారాయణ ఎన్నికయ్యారన్నారు. వీరితోపాటు 48 డైరెక్టర్లు ఏకగ్రీవమయ్యాయని ఆయన వివరించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలంలోని 5 నీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్ష, టీసీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తహసిల్దార్ యడ్ల దుర్గా కిషోర్ తెలిపారు. శివదేవునిచిక్కాల నీటి సంఘం అధ్యక్షుడిగా ఇంటి శ్రీరాముడు, ఉపాధ్యక్షుడిగా యల్లపు చంద్రశేఖర్, దిగమర్రు నీటి సంఘం అధ్యక్షుడిగా మాతా రత్నంరాజు, ఉపాధ్యక్షుడిగా పరువు సత్యనారాయణ, వెలివెల నీటి సంఘం అధ్యక్షుడిగా పులఖండం వీరరాఘవులు, ఉపాధ్యక్షుడిగా కండిబోయిన నాగరాజు, పాలకొల్లు నీటి సంఘం అధ్యక్షుడిగా తానెంకి వెంకట కృష్ణారావు, ఉపాధ్యక్షుడిగా పంచిగళ్ల సైమన్, లంకలకోడేరు నీటి సంఘం అధ్యక్షుడిగా గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, ఉపాధ్యక్షుడిగా వాసా కోటేశ్వరరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పోడూరు మండలంలో....

పోడూరు మండలంలో 5 నీటి సంఘాలకు ఏకగ్రీవంగా ఎన్నికలు నిర్వహించినట్లు తహసీల్దార్ సయ్యద్ ఫాజిల్ తెలిపారు. పెనుమదం నీటి సంఘం అధ్యక్షుడిగా దేవరపు దొరబాబు, ఉపాధ్యక్షుడిగా రుద్రరాజు వెంకట సుబ్రహ్మణ్యంరాజు, మట్టపర్రు నీటి సంఘం అధ్యక్షుడిగా దేవళ్ల శ్రీరామకోటి మోహన్, ఉపాధ్యక్షుడిగా పోతంశెట్టి కృష్ణారెడ్డి, పోడూరు నీటి సంఘం అధ్యక్షుడిగా కోడేటి రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా కేతా వెంకటస్వామి, వేడంగి నీటి సంఘం అధ్యక్షుడిగా కుక్కల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా యర్రంశెట్టి నరసింహరావు, కవిటం నీటి సంఘం అధ్యక్షుడిగా నెక్కంటి వీర వెంకట సత్య ప్రభాకరరావు, ఉపాధ్యక్షుడిగా కడలి సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆయన తెలిపారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలో ఐదు నీటి సంఘాలకు శనివారం జరిగిన ఎన్నికలలో 60 వార్డులకు గాను ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. ఐదు సాగు నీటి సంఘాలకు కూడా అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. పెనుమంట్ర నీటి సంఘ అధ్యక్షుడిగా వెలగల బులిరామిరెడ్డి, కటికతల యేసయ్య, ఆలమూరు సాగునీటి సంఘానికి ఇందుకూరి వెంకట నరశింహరాజు, తేతలి వెంకటరామారెడ్డి, , పాలమూరు సంఘానికి గుడాల వెంకటేశ్వరరావు, ఆచంట వెంకటేశ్వరరావు, జుత్తిగ నీటి సంఘానికి కొవ్వూరి సోమ భాస్కరరెడ్డి, కడలి వెంకటేశ్వరరావు, మల్లిపూడి నీటి సంఘానికి దాసు కనక దుర్గా ప్రసాద్, అద్దాల జయరాజులను అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల ఎన్నికల అధికారి వై.రవికుమార్ తెలిపారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాసరావు

పాలకొల్లు అర్బన్: గంజాయి, నాటుసారా, డ్రగ్స్ తదితర మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని పాలకొల్లు ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాసరావు చెప్పారు. పట్టణంలోని శ్రీ విశ్వ జూనియర్ కళాశాలలో శనివారం మాదవ ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే కార్యక్రమంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. అన్ని విద్యా సంస్థల్లో ప్రిన్సిపాల్ అధ్యక్షతన, సీనియర్ ఫ్యాకల్టీ, విద్యార్థులతో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

ఎన్నికలను బహిష్కరించిన గ్రామస్తులు



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు,రైతులు

మొగల్తూరు: మొగల్తూరు మండలంలోని మొగల్తూరు, రామన్నపాలెం, కాళీపట్నం, జగన్నాదపురం గ్రామాల నీటి సంఘాలకు సంబంధించి శనివారం నిర్వహించిన ఎన్నికలలో మొగల్తూరు, రామన్నపాలెం సంఘాలు ఏకగ్రీవం కాగా, జగన్నాథపురం, కాళీపట్నం సంఘాల ఎన్నికలు వాయిదా పడ్డాయి.మొ గల్తూరు నీటి సంఘం అధ్యక్షునిగా కడలి వీర మోహన రావు, రామన్నపాలెం నీటి సంఘం అధ్యక్షుడిగా గుబ్బల మార్రాజులు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా కాళీపట్నం, జగన్నాథపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు, రైతులు మాట్లాడారు. కాళీపట్నం జమిందారీ భూములకు సంబంధించి క్రయ,విక్రయాలు లేక గత 20 సంవత్సరాలుగా అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాళీపట్నం రెవెన్యూ గ్రామాల్లో సుమారు 1756 మంది రైతులుండగా కేవలం 10 మంది రైతులనే ఓటర్లుగా చూపిస్తున్నారన్నారు. జగన్నాథపుంలో నాయకులు మాట్లాడుతూ గతంలో ఏవిదంగా ఎన్నికలు నిర్వహించారో? అదే విధంగా ఎన్నికలు నిర్వహిరచాలని 341 మంది ఓటర్లు ఉంటే కేవలం కొద్దిమందిని మాత్రమే ఓటర్లుగా చూపిస్తున్నారని దీనికి నిరసనగా తాము నీటి సంఘా ఎన్నికలను బహిష్కరిస్తున్నామని ఇరు గ్రామాల నాయకులు తెలిపారు. దీనిపై ఎన్నికల అధికారి అయిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహనరావును వివరణ కోరగా సమయం గడిచిపోతున్నా ఓట్లు వేసేందుకు ఓటర్లు రావడం లేదా నామినేషన్లు వేయడం చేయలేదన్నారు. దీంతోఎన్నికల నిబంధనలు ప్రకారం క్యాజువల్ వేకెన్సీగా ప్రకటించి అధికారులకు సమాచారం అందించామన్నారు. ఈ సమావేశంలో గట్టిం శ్రీను, ఎన్ఆర్‌కె రామకృష్ణంరాజు, జోగి పండు, పులపర్తి సూర్యనారాయణ, సత్తినేని తాతాజీ పాల్గొన్నారు.